

29న జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు
బాలబాలికల ఎంపిక

గజ్వేల్‌టౌన్ 24: జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ ఎంపికలు ఈనెల 29న ప్రజ్ఞాపూర్‌లోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్ హైస్కూల్ ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అధ్యక్షుడు కైలాసం తెలిపారు. ఆసక్తి గలవారు జనన ధ్రువీకరణ పత్రం లేదా పాఠశాల బోనఫైడ్‌తో హాజరుకావాలన్నారు. వివరాలకు 7981923779 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

- సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, జనవరి 24: సిద్దిపేట జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ పోలీసు అధికారులకు సూచించారు. బుధవారం సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా వివిధ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రమాదాలు సంభవించకుండా రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా పరిధిలో ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించామని, ఆ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడిపేలా అవగాహన కల్పించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, రహదారుల ఇంజనీరింగ్ అధికారులు పోలీస్ అధికారులతో కలిసి బ్లాక్‌స్పాట్స్‌ను సందర్శించి ప్రమాదాల నివారణ గురించి పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించిన ప్రాంతాల్లో రంబుల్ స్ట్రిప్స్, స్టడ్స్, సూచిక బోర్డులు, బ్లింకర్స్, అదర్ సైన్‌బోర్డ్స్ వంటివి ఏర్పాటు చేయాలని చెప్పారు. మూలమలుపుల వద్ద అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని ఆమె సూచించారు. హైవేపై ప్రమాదాలు జరిగినప్పుడు సమయానికి అంబులెన్స్ అందుబాటులో ఉండాలని, ప్రమాదానికి గురైన వారిని ఏ విధంగా ఆసుపత్రికి చేర్చాలన్న విషయమై 108 అంబులెన్స్ సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాలు నివారించడంలో అందరూ సమన్వయంతో పని చేయాలని కోరారు. రోడ్డు భద్రతా ప్రమాదాల నివారణ గ్రామాలలో ఉన్న రోడ్డు భద్రతా కమిటీలు, వాలంటీర్లతో ప్రజలకు, విద్యార్థులకు ఆర్టీవో అధికారులతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.






సొబగులు చూడతరమా

సంస్కృతీ సాంప్రదాయాలు ఉట్టిపడేలా.. చరిత్రను గుర్తుచేసేలా, జిల్లా అభివృద్ధి ప్రతిబింబించేలా నకాశి చిత్రాలు కనువిందు చేస్తున్నాయి. కొండపాక మండలం ఐనాపూర్ శివారు, తిమ్మారెడ్డిపల్లి కమాన్ సమీపంలో కొమురవెల్లికి వెళ్లే రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి గోడలకు వేసిన నకాశి చిత్రాలు అటుగా వెళ్లే వారిని ఆకట్టుకుంటున్నాయి.

- సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్





నీటి విడుదల..
రైతులకు ఊరట

- అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- రంగనాయకసాగర్, మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి నీటి విడుదల
- తొగుట, మిరుదొడ్డిలో పలు అభివృద్ధి పనుల ప్రారంభం



రంగనాయకసాగర్ ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తున్న మంత్రి కొండా సురేఖ

చిన్నకోడూరు, జనవరి 24 : కాలువల ద్వారా యాసంగి సాగుకు నీటిని విడుదల చేయడం రైతులకు ఊరట కలిగించే విషయమని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్ ప్రాజెక్టులోని గోదావరి జలాలకు ఆమె పూజలు చేసి హారతినిచ్చారు. అనంతరం కుడి, ఎడమ కాలువల ద్వారా నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. రంగనాయకసాగర్ ప్రాజెక్టు కింద లక్షా10వేల ఎకరాల సాగు భూమి ఉందన్నారు. 3 టీఎంసీల సామర్థ్యం గల ప్రాజెక్టులో ప్రస్తుతం 2.4 టీఎంసీల నీరు నిల్వ ఉందని మంత్రి తెలిపారు. రంగనాయకసాగర్ ఎడమ కాలువ ద్వారా 70 వేల ఎకరాలకు, కుడికాలువ ద్వారా 40 వేల ఎకరాలకు సాగునీరు అందనుందన్నారు. ఎడమ కాలువ ద్వారా చిన్నకోడూరు, సిద్దిపేటరూరల్, నారాయణరావుపేట, రాజన్నసిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట, ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాలకు, కుడి కాలువ ద్వారా సిద్దిపేటపేటఅర్బన్, నంగునూరు మండలాలకు యాసంగి పంటకు సాగునీరు అందనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, ఈఎన్‌సీ హరిరాం, ఎస్ఈ బస్వరాజ్, ఈఈ గోపాలకృష్ణ, కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, మద్దూరు జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



తొగుటలో గ్రామపంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కొండా సురేఖ, పక్కన కలెక్టర్ ప్రశాంత్

తొగుట మండలంలో మంత్రి సుడిగాలి పర్యటన

తొగుట: తొగుట మండలంలో బుధవారం రాత్రి అటవీ, పర్యాటక, దేవాదాయశాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా తొగుట మండలం తుక్కాపూర్ గ్రామశివారులో 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన మల్లన్నసాగర్ రిజర్వాయర్‌ను సందర్శించారు. అనంతరం దుబ్బాక కాలువకు మల్లన్నసాగర్ నుంచి సాగునీటిని విడుదల చేశారు. అక్కడి నుంచి తొగుటకు చేరుకుని (ఎన్ఆర్ ఈజీఎస్, ఎస్‌డీఎఫ్ నిధులు) రూ.30 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ నూతన భవనం, తొగుట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో (మన ఊరు- మనబడి కింద) రూ.16 లక్షలతో నిర్మించిన డైనింగ్ హాల్, (సర్వశిక్ష అభియాన్ నిధుల ద్వారా) రూ.3.87కోట్లతో నిర్మించిన కస్తూర్బా పాఠశాలను ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.22లక్షలతో నిర్మించిన రైతువేదిక భవనాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె వెంట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, తొగుట ఎంపీపీ లత నరేందర్‌రెడ్డి, ఆర్‌వీఎం డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో యాదవరెడ్డి, ఎంపీడీవో శ్రీధర్, తొగుట సర్పంచ్ కొండల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్కం స్వామి, నాయకులు నిరంజన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, విజయ్‌రెడ్డి, ఉప్పలయ్య, తిరుపతి, మల్లారెడ్డి, మహిపాల్‌రెడ్డి, షఫి, పద్మారెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, బాల్‌రాజ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మిరుదొడ్డిలో..

మిరుదొడ్డి : మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామంలో బుధవారం అటవీ, పర్యాటక, దేవాదాయశాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్‌తో కలిసి గ్రామంలో రైతువేదిక, గ్రామపంచాయతీ భవనం, ఆరోగ్య ఉపకేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అంతా కలిసి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో జిల్లాలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని సూచించారు. తాను ఆలస్యంగా వచ్చినప్పటికీ తన కోసం ఎదురుచూసిన గ్రామస్థులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీవో దేవసేనా, జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్, గ్రామసర్పంచు కిష్టయ్య, ఉప సర్పంచు దిలీప్, తదితరులు పాల్గొన్నారు.



బెజ్జంకి క్రాసింగ్ రాజీవ్ రహదారిపై ధర్నా చేస్తున్న గుగ్గిళ్ల గ్రామస్థులు

'ఈథనాల్' ఫ్యాక్టరీ అనుమతుల రద్దుకు
గ్రామస్థుల ధర్నా

బెజ్జంకి, జనవరి 24: ఈథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో తీవ్రంగా నష్టపోతామని, పరిశ్రమ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బెజ్జంకి మండలం గుగ్గిళ్ల గ్రామస్థులు రాజీవ్ రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. మండలంలోని గుగ్గిళ్ల గ్రామశివారులో 557, 559, 561 సర్వే నంబర్‌లో ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయని తెలిపారు. అయితే ఫ్యాక్టరీ ఏర్పాటు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ కొద్దినెలలుగా ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సంబంధితశాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశామని ఈ సందర్భంగా గ్రామస్థులు తెలిపారు. గ్రామశివారులో ఫ్యాక్టరీ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఈథనాల్ పరిశ్రమ వ్యతిరేక పోరాట కమిటీని ఏర్పాటు చేసినట్లు స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఫ్యాక్టరీ నిర్మాణ పనులను సంబంధిత యాజమాన్యం చేపట్టడంతో బుధవారం బెజ్జంకి క్రాసింగ్ రాజీవ్ రహదారిపై గ్రామస్థులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. సుమారు అరగంటకు పైగా ధర్నాకు దిగారు. ఫ్యాక్టరీ ఏర్పాటైతే అందులో నుంచి వెలువడే కాలుష్యం వల్ల భూములు, పంటలు దెబ్బతింటాయని ఆవేదన చెందారు. భూసారం తగ్గి పంటలు సరిగా పండవని వెంటనే ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడి ధర్నాను విరమింప చేశారు.

జూన్ తర్వాత బీఆర్ఎస్ ఖాళీ అవడం ఖాయం

- పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్యనే పోటీ
- మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు

నర్సాపూర్, జూన్ 24: వచ్చే జూన్ తర్వాత బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా ఖాళీ అవడం ఖాయమని బీజేపీ రాష్ట్ర నేత, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు పేర్కొన్నారు. బుధవారం నర్సాపూర్ మండలం చిప్పల్‌తుర్తి సమీపంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్ నేతృత్వంలో నియోజకవర్గస్థాయి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యనే పోటీ ఉంటుందని బీఆర్ఎస్ పార్టీకి ఒక్క సీటు కూడా రాదని జోష్యం చెప్పారు. బీజేపీకి బలం కార్యకర్తలే అని, వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఆత్మవిశ్వాసంతో పనిచేయాలని కోరారు. మోదీ నాయకత్వంలో బీజేపీ మూడోసారి కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డిని కలవడంలో మర్మమేమిటో జనాలకు తెలుసన్నారు. నలుగురు ఎమ్మెల్యేలు సీఎంను కలిసిన విషయం జిల్లాకే చెందిన మాజీ మంత్రి హరీశ్‌రావుకు తెలవకుండానే జరిగిందా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, కౌన్సిలర్లు రాజేందర్, బుచ్చేస్‌యాదవ్, యాదగిరి, లతరమేష్‌యాదవ్, మాజీ ఎంపీపీ రమణారావు, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెద్ద రమేష్‌గౌడ్, ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనపురం ఆయకట్టుకు సింగూరు జలాల విడుదల

- మంజీర జలాశయంలోకి 2,667 క్యూసెక్కుల నీరు

పుల్‌కల్, జనవరి 24 : మెదక్ జిల్లాలోని ఘనపురం ఆయకట్టు పరిరక్షణకు బుధవారం సింగూరు జలాలను విడుదల చేశారు. ఘనపురం ఆనకట్ట కుడి, ఎడమ కాలువల కింద ప్రస్తుతం యాసంగి సీజన్ వరి నాట్లు వేస్తుండటతో ఆయకట్టు పరిరక్షణకు సింగూరు జలాలను విడుదల చేయాలంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో సింగూరు ప్రాజెక్టు నీటి పారుదల శాఖ అధికారులు బుధవారం ఉదయం నుంచి నీటి విడుదలను ప్రారంభించారు. ప్రాజెక్టుకు ఎడమవైపున నిర్మించిన జల విద్యుత్ కేంద్రంలోని 7.5 మెగావాట్ల సామర్థ్యం గల రెండు విద్యుత్ ఉత్పత్తి గేట్ల ద్వారా 2,667 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న మంజీర జలాశయంలోకి వదులుతున్నారు. మంజీర జలాశయానికి జలాలు చేరుకున్న అనంతరం ఆదివారం వరకు ఘనపురం ఆనకట్టకు విడుదల చేసే అవకాశాలున్నాయి. ఘనపురం ఆయకట్టు పరిరక్షణ కోసం ప్రస్తుతం యాసంగి సీజన్‌కు పూర్తయ్యేంత వరకు జలాలను విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు జేఈఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. మొదటి విడతగా 12న 0.35 టీఎంసీ జలాలను విడుదల చేశామని, తాజాగా 0.35 టీఎంసీ విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. వరి కోతకు వచ్చేంత వరకు విడతల వారీగా విడుదల చేస్తామని తెలియజేశారు. మంజీర నదీ పరీవాహక ప్రాంత రైతులు అప్రమత్తంగా ఉండాలని జేఈఈ మహిపాల్‌రెడ్డి కోరారు.

ఆత్మరక్షణకు కరాటే


- బాలికల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు పాఠశాలల్లో ఉచిత శిక్షణ
- మూడునెలల పాటు కొనసాగనున్న తరగతులు
- 159 పాఠశాలల్లో నిష్ణాతులైన మాస్టర్లతో బాలికలకు ట్రైనింగ్



తొగుట మండలం ఘనపూర్ ప్రభుత్వ పాఠశాలలో కరాటే శిక్షణలో పాల్గొన్న విద్యార్థినులు

తొగుట, జనవరి 24: బాలికల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలలతో పాటు కస్తూర్బా పాఠశాలల్లోని విద్యార్థినులకు ఉచిత కరాటే శిక్షణ కార్యక్రమాన్ని డిసెంబరు 15న విద్యాశాఖ అధికారులు ప్రారంభించారు. మూడునెలల పాటు సాగే ఈ ఉచిత శిక్షణకు నిష్ణాతులైన





కరాటే మాస్టర్లను నియమించారు. వారు రోజుకు గంటకు పాటు బాలికలకు కరాటేలో శిక్షణనిస్తున్నారు.

జిల్లాలో మొత్తం 362 పాఠశాలలు ఉన్నాయి. అందులో 227 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 113 ప్రాథమికోన్నత పాఠశాలలు, 22 కస్తూర్బా పాఠశాలలు ఉన్నాయి. గత సంవత్సరం 225 పాఠశాలల్లో నెల రోజుల పాటు కరాటే శిక్షణ ఇచ్చారు. ఇక ఈ ఏడాది 159 పాఠశాలలను ఎంపిక చేసి డిసెంబరు 15న ఉచిత శిక్షణా తరగతులను ప్రారంభించారు. మార్చి 15 వరకు కరాటే శిక్షణను బాలికలకు ఇవ్వనున్నారు. ఉచిత కరాటే శిక్షణ కోసం 70 మంది నిష్ణాతులైన కరాటే మాస్టర్‌లను ప్రభుత్వం నియమించింది. వారి కోసం ఒక్కో పాఠశాల సర్వశిక్ష అభియాన్ నిధుల నుంచి రూ.5వేల చొప్పున చెల్లించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఒక్కో శిక్షకుడు మూడు నుంచి నాలుగు పాఠశాలల్లో బాలికలకు కరాటే శిక్షణ ఇస్తున్నారు. ఒక్కో పాఠశాలలో రోజుకు ఒక గంటపాటు శిక్షణనిస్తారు. శిక్షణలో ఎదుటి వారి నుంచి ఆత్మరక్షణ ఎలా పొందాలో శిక్షకులు బాలికలకు మెలకువలు నేర్పిస్తున్నారు. బాలికలు కూడా శిక్షణలో ఉత్సాహంగా పాల్గొని తమను తాము ఎలా రక్షించుకోవాలో నేర్చుకుంటున్నారు.

శిక్షణను నిరంతరం కొనసాగించాలి



- రమ్య, పదోతరగతి, ఎల్లారెడ్డిపేట

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు అందిస్తున్న ఆత్మరక్షణ విద్య చాలా ఉపయోగకరంగా ఉంది. మేము బయటకు వెళ్లినపుడు ఎవరి వల్లనైనా ఇబ్బంది ఎదురైనపుడు మమ్మల్ని మేము ఎలా రక్షించుకోవాలో శిక్షణలో నేర్పిస్తున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని విద్యాసంవత్సరం మొత్తం కొనసాగించాలి.

భవిష్యత్‌లో ఎంతో ఉపయోగకరం

- స్వాతి, పదో తరగతి, కస్తూర్బాగాంధీ పాఠశాల, తొగుట



కరాటే నేర్చుకోవడం మాకు ఎంతో ధైర్యాన్నిస్తుంది. శిక్షణలో నేర్చుకుంటున్న మెళకువలు మాకు భవిష్యత్తులో ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ప్రతి బాలిక కరాటే నేర్చుకుని ఆత్మనిబ్బరంతో ముందుకు సాగాలి.

బాలికల్లో ఆత్మస్థైర్యం నింపడమే లక్ష్యం

- ముక్తేశ్వరి, డిస్ట్రిక్ గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్



బాలికల్లో ఆత్మస్థైర్యం నింపడం కోసం జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత కరాటే శిక్షణ తరగతులు ప్రారంభించాం. గత సంవత్సరం 225 పాఠశాలల్లో నెలరోజుల పాటు శిక్షణ ఇప్పించాం. ఈ ఏడాది 159 పాఠశాలల్లో కరాటే శిక్షణ తరగతులను ప్రారంభించాం. మూడు నెలల పాటు బాలికలకు శిక్షణ ఇప్పించడానికి నిష్ణాతులైన 70 మంది మాస్టర్లను నియమించాం. ప్రతి ఏడాది ఈ ఉచిత శిక్షణ తరగతులను కొనసాగిస్తాం.

కోనేటికుంటలో కబ్జాల కూల్చివేత

పటాన్‌చెరు, జనవరి 24: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ గుట్ట దిగువన ఉన్న కోనేటికుంటలో బుధవారం రెవెన్యూ సిబ్బంది కబ్జాలను కూల్చివేశారు. కోనేటికుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో నాలుగు అక్రమ నిర్మాణాలను ఎక్స్‌వేటర్‌తో కూల్చివేయించారు. పక్కనే 993 అసైన్డ్‌భూమిలో నిర్మిస్తున్న కట్టడాలను తొలగింపజేశారు. అమీన్‌పూర్ ఆర్‌ఐలు రఘునాథ్‌రెడ్డి, రాజు నేతృత్వంలో కూల్చివేతలు కొనసాగాయి. ప్రభుత్వ భూములు, కుంటలు కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ గౌరీవత్సల హెచ్చరించారు.

గ్రామ పంచాయతీల్లో జాతీయ జెండాను ఎవరు ఎగురవేయాలి?

● కలెక్టర్ ఉత్తర్వుల్లో లేని స్పష్టత

సిద్దిపేట అగ్రికల్చర్, జనవరి 24 : గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధం చేసింది. ప్రభుత్వ కార్యాలయ వద్ద ఏఅధికారులు ఎక్కడ జెండా ఎగురవేయాలో కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద మాత్రం ఎవరు జాతీయ పతాకాన్ని ఎగురవేయాలో ఉత్తర్వుల్లో పేర్కొనలేదు. సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ ఆవరణంలో అదనపు కలెక్టర్ గరీమ అగ్రవాల్ జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. అనంతరం అధికారులంతా ఉదయం 9 గంటలకు నిర్వహించే సిద్దిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లా స్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరుకావాలని, సర్క్యులర్‌లో ఉంది. రెవెన్యూ డివిజన్ ప్రధాన కార్యాలయంలో రెవెన్యూ డివిజన్ ఆఫీసర్, సబ్ డివిజనల్ ఆఫీసర్ జెండాను ఎగరవేయాలి. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవోలు, ఎమ్మార్వో కార్యాలయంలో తహసీల్దార్ జాతీయ జెండాను ఆవిష్కరించాలి. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు జాతీయ జెండాను ఆవిష్కరించాలని ఉత్తర్వుల్లో ఉంది. కానీ ఎవరు జాతీయ పతాకాన్ని ఎగురవేయాలో తెలపలేదు. పంచాయతీల్లో సర్పంచ్‌లు, కార్యదర్శుల్లో ఎవరు ఆవిష్కరించాలో స్పష్టత ఇవ్వలేదు.

అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

● సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

జహీరాబాద్, జనవ 24 : గ్రామాల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బూచనెల్లి గ్రామంలో రూ.51లక్షల వ్యయంతో సీఎస్సార్ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ప్రజల అత్యవసరాలను గుర్తించి పనులను చేపడితే ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భారతమ్మ, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చంద్రశేఖర్

'రెవెన్యూ' వద్ద ఆ భూమి రికార్డుల్లేవ్!

- హైదరాబాద్-శ్రీశైలం హైవే భూమి వివరాలివ్వాలని ఎన్‌హెచ్ఏఐకు వినతి
- 'రహదారికీ రైతుబంధు'పై విస్తృత చర్చ
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై అధికారుల ఆరా

ఆమనగల్లు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'రహదారికీ రైతుబంధు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం సర్వత్రా చర్చనీయాంశమైంది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి నిర్మించిన భూమికి ప్రభుత్వం ఏళ్లుగా రైతుబంధు సొమ్ము ఇస్తూ వచ్చిన వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది. అయితే రోడ్డు నిర్మించిన భూమికి సంబంధించి రెవెన్యూ అధికారుల వద్ద సరైన రికార్డులు లేనట్లు సమాచారం. దాంతో ఆ రికార్డులు అందజేయాలని రెవెన్యూ అధికారులు.. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులను కోరినట్లు తెలిసింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో ఈ సమస్య వెలుగుచూసింది. రోడ్డు కోసం పట్టా భూములను సేకరించినా దానికి అనుగుణంగా రికార్డుల్లో మార్పు చేయలేదు. గత ప్రభుత్వ లోపాల వల్ల ఈ భూమికి రైతుబంధు సహాయం అందుతుండడమే కాక మరో సమస్య కూడా తలెత్తుతోంది. భూముల ధరలకు రెక్కలు వస్తుండడంతో చాలామంది రైతులు జాతీయ రహదారి ఉన్న భూమిని కూడా ధరణి రికార్డుల ఆధారంగా విక్రయించి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నా యి. ఇదే జరిగితే పెద్దఎత్తున వివాదాలు చోటు చేసుకునే అవకాశాలు లేకపోలేదు. ఇటీవల కడ్తాల- మైసిగండి మధ్య రోడ్డు నిర్మా ణం జరిగిన 1.20 ఎకరాల భూమి.. ధరణి పాస్ పుస్తకంలో కూడా ఉండడంతో రూ.5 కోట్లకు విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దాన్ని వేరొకరికి రిజిస్ట్రేషన్ చేయకుం డా బ్లాక్‌లిస్టులో పెట్టాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు అందింది.


హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి

కాగా, ఎన్‌హెచ్ఏఐ అధికారులను రికార్డులు అడగడంతో పాటు రోడ్డు ఉన్న సర్వే నంబరు భూములను పరిశీలించి సంబంధిత రైతుల రికార్డుల నుంచి ఆ భూమిని తొలగించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇటు ప్రభుత్వం ఈ విషయమై ఉన్నతస్థాయి విచారణ జరిపిస్తే అనేక విషయాలు వెలుగుచూసే అవకాశం ఉందన్న అభిప్రాయం స్థానిక ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ఆమనగల్లుకు చెందిన ఓ రైతు ఇటీవల స్థానిక తహసీల్దార్‌కు, కడ్తాల్‌కు చెందిన మరో రైతు ప్రజావాణిలో సీఎం రేవంత్ రెడ్డికి ఇదే విషయమై ఫిర్యాదు చేశారు.

కేసీఆర్‌ను సీఎం చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బాధాకరమేమీ కాదని, చాలా చిన్న దెబ్బ మాత్రమే తగిలిందని అన్నారు. "ప్రజలు మనల్ని ఛీకొట్టలేదు. 39 స్థానాల్లో గెలిచాం. మరో 14 స్వల్ప తేడాతో ఓడాం. ఆ 14 స్థానాల్లో ఇతర పార్టీలు గతంలో రెండు, మూడు, నాలుగుసార్లు వరుసగా పోటీచేసి.. ఒక్కసారైనా గెలిపించాలంటూ ఏడవడంతో ప్రజలు భావోద్వేగాలతో వారికి ఓటేశారు. ఇందులో ఆరేడు స్థానాలు బీఆర్ఎస్ గెలిస్తే ఎలా ఉండేది? 1.85 శాతం ఓట్ల తేడాతో మాత్రమే అధికారం కోల్పో యాం" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజల తీర్పు ను అవమానపరిచే విధంగా మాట్లాడవద్దని పార్టీ శ్రేణులు, సోషల్ మీడియా వారియర్స్‌కు సూచించారు. "కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్‌లో గెలిచాం. మిగిలిన నాలుగింటిలో కూడా వారు సానుభూతితోనే గెలుపొందారు. అయినా మనకంటే వారికి కేవలం ఐదారు వేల ఓట్లు మాత్రమే ఎక్కువ వచ్చా యి. ఈ ఏడుపు, సానుభూతి ఎప్పటికీ ఉండదు" అని వ్యాఖ్యానించారు.

420 హామీలతో ప్రజలను నమ్మించారు..

ఎన్నికల్లో తప్పుడు హామీలతో రేవంత్‌రెడ్డి ప్రజలను నమ్మించారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలే కాకుండా.. మేనిఫెస్టోలో పేర్కొన్నవన్నీ కలిపి 420 హామీలు ఇచ్చారని, వాటిని ప్రజలకు వివరించి అమలయ్యే వరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. హామీలు అమలు చేయకుంటే రోడ్డుపై బట్టలూడదీసి ప్రభుత్వాన్ని నగ్నంగా నిలబెడతామని హెచ్చరించారు. సోషల్ మీడియాను పదునుగా వాడుకొని నరేంద్రమోదీ ప్రధానమంత్రి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని చెప్పారు. రైతు భరోసా ఇచ్చామంటూ రేవంత్‌రెడ్డి దావో‌స్‌లో పచ్చి అబద్ధం చెప్పారని, రైతుబంధు పేరు మార్చారే తప్ప.. డబ్బులు ఇవ్వలేదని తెలిపారు. రైతుబంధు పడలేదంటే చెప్పుతో కొడతామంటూ మంత్రి కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ మండిపడ్డారు. రైతు భరోసా రాని70 లక్షల మంది రైతులు ఈ ప్రభుత్వాన్ని చెప్పుతో కొడతారో, ఓట్లతో కొడతారో ఆలోచించుకోవాలన్నారు. క్వింటాల్ ధాన్యానికి ఇస్తామన్న రూ.500 బోనస్ ఇచ్చి తీరాలని డిమాండ్ చేశారు. మార్పు కావాలని ఓట్లు వేసిన 6.5 లక్షల ఆటో కార్మికుల కుటుంబాల కొంప కొల్లేరు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు వారికి ఏ అవకాశమచ్చినా కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎరువులు, విత్తనాల దుకాణాల వద్ద క్యూ కట్టాల్సి వస్తుందని ఎవరూ అనుకోలేదని, మళ్లీ ఆ రోజులు వచ్చాయని విమర్శించారు. బస్సుల సంఖ్యను పెంచకుండా, బస్సుల కండిషన్ ఎలా ఉందో తెలుసుకోకుండా అనాలోచితంగా మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడంతో బస్సుల్లో వారు కొట్టుకుంటున్నారని తెలిపారు. మరోవైపు డబ్బులు పెట్టుకొని వెళ్లే పురుషులకు సీట్లు దొరకడం లేదని, ఎవరూ సంతృప్తిగా లేరని అన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కోటి 57 లక్షల మంది మహిళలకు నెలకు 2,500 ఇవ్వకుంటే తాట తీయాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని అసెంబ్లీలో ప్రశ్నిస్తే.. తాము ఆ హామీ ఇవ్వలేదని భట్టివిక్రమార్క అన్నారని చెప్పారు.


బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ భేటీలో మాట్లాడుతున్న కేటీఆర్

మతం, దేవుళ్లతో బీజేపీ రాజకీయం..

బీజేపీ ఎంపీలు మతం, దేవుళ్లతో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. నిత్యం మతం, ధర్మం అంటూ రెచ్చగొడుతూ కరీంనగర్‌లో గెలిచిన బండి సంజయ్‌కుమార్ అట్టర్ ఫ్లాప్ ఎంపీ అని విమర్శించారు. వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట రామాలయానికి మోదీ నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదన్నారు. ఐదేళ్లలో సంజయ్ చేసిన అభివృద్ధి ఏంటో మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నలుగురు ఎంపీలను ఓడించింది బీఆర్ఎస్ కాదా? రెండు పార్టీలు ఒకటైతే కామారెడ్డిలో కేసీఆర్ ఓడిపోయేవారా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మోదీ, అదానీ ఒకటేనంటూ రేవంత్, రాహుల్ గాంధీ ప్రచారం చేశారని, ఇప్పుడు ఆయనతోనే ఒప్పందం కుదుర్చుకున్నారని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్‌లో మోదీ, అదానీ తరువాత.. రేవంత్ మూడో ఇంజన్‌గా మారారన్నారు. కేసీఆర్ సర్కారు పదేళ్ల అదానీని రాష్ట్రంలో అడుగుపెట్టనీయలేదని, అమిత్‌షా, మోదీ సూచనతోనే అదానీతో రేవంత్ ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర సంస్థలను అదానీకి కట్టబెడతారన్నారు. రేవంత్ మరో ఏక్‌నాథ్ షిండే అయినా ఆశ్చర్య పోవలసిన అవసరం లేదని, మైనారిటీలు ఆలోచించాలని సూచించారు.



మీడియాతో ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి

విపక్ష ఎమ్మెల్యేలు సీఎంను కలవకూడదా?

- రేవంత్ తెలంగాణ రాష్ట్రానికి సీఎం కాదా?
- సమస్యల పరిష్కారం కోసమే కలిశాం
- పార్టీని వీడేది లేదు.. ప్రతిపక్షంలోనే ఉంటాం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీత, ప్రభాకర్‌రెడ్డి మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు స్పష్టీకరణ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):"కాంగ్రెస్ పార్టీకే.. రేవంత్ ముఖ్యమంత్రా? తెలంగాణకు కాదా? నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్ష నేతలు సీఎంను కలవకూడదా?" అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కె.మాణిక్‌రావు ప్రశ్నించారు. తాము కాంగ్రెస్‌లో చేరుతున్నామంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. రెండ్రోజుల క్రితం ఈ నలుగురు ఎమ్మెల్యేలూ సీఎం రేవంత్‌ను కలవడంతో వారు పార్టీ మారుతున్నారన్న ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో వారు బుధవారం మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగానే కలిశామని, ప్రజాసమస్యలను చర్చించడంతోపాటు సెక్యూరిటీ, ప్రొటోకాల్ సమస్యలపై కూడా మాట్లాడామన్నారు. ప్రతిపక్షంలో ఉంటే సీఎంను, మంత్రులను కలవకూడదా? ప్రధాని మోదీని, కేంద్రమంత్రులను సీఎం రేవంత్ కలవడం లేదా అని ప్రశ్నించారు. తమ నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి అంశాల్లో సహకరించాలని సీఎంను కోరామన్నారు. కాంగ్రెస్ లోకి వెళ్లాల్సిన అవసరం తమకు ఏముందని వారు ప్రశ్నించారు. సీఎంను మాత్రమే కాదని, సమస్యల పరిష్కారం కోసం మంత్రులనూ కలుస్తూనే ఉంటామన్నారు. తమపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఆపాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ మారే ప్రసక్తే లేదని.. ప్రతిపక్షంలోనే ఉండి పోరాడతామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్సే మెజార్టీ స్థానాల్లో గెలుస్తుందని అన్నారు.

రాహుల్ ప్రజల్లోకి వెళ్తుంటే బీజేపీకి ఎందుకంత భయం?

- గుడికి వెళ్లడానికీ అసోం సీఎం అనుమతి కావాలా?
- అప్పట్లో బతుకమ్మ పేరుతో కవిత మాదిరిగానే ఇప్పుడు రామాలయం పేరుతో మోదీ సినిమా చూపిస్తున్నారు..
- అయోధ్య గుడికి కారకుడైన అడ్వాణీని సన్మానించారా?: జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): "రాహుల్‌గాంధీ ప్రజల్లోకి వెళుతుంటే.. బీజేపీకి ఎందుకంత భయం? రాహుల్ గాంధీ గుడికి పోవద్దా? అందుకు అసోం సీఎం అనుమతి తీసుకోవాలా?" అంటూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ప్రశ్నించారు. అసోం ప్రజలకు ఇబ్బంది లేకుండా రాహుల్‌గాంధీ పాదయాత్ర సాగుతోందని, అయితే ప్రధాని మోదీ దగ్గర మెప్పు కోసమే పాదయాత్రను అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ అడ్డుకున్నారని ఆరోపించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీని యాత్ర చేయకుండా అడ్డుకునే కుట్రను బీజేపీ చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. మోదీ పాలనలో న్యాయమైన పాలన జరగట్లేదని, ధరల పెరుగుదలకూ అడ్డూ అదుపూ లేకుండా పోతోందని విమర్శించారు. దీనిపై ప్రజలను సంఘటితం చేసే పనిలో భాగంగా రాహుల్‌గాంధీ 'న్యాయ్ యాత్ర'ను చేపట్టారని, అసోంలో రాహుల్ యాత్రను బీజేపీ వాళ్లు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం? అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే అసోం ప్రభుత్వం అక్కడ శాంతి భద్రతల సమస్యను సృష్టిస్తోందని ఆరోపించారు. నిన్న మొన్నటిదాకా బతుమ్మ పండుగే లేనట్లుగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బతుకమ్మ పేరుతో సినిమా చూపించిందని, ఇప్పుడు ప్రధాని మోదీ.. రామాలయం పేరుతో సినిమా చూపిస్తున్నారని విమర్శించారు. బీజేపీ నేతలు ఈ మధ్యనే కళ్లు తెరిచి.. రాములవారిని మొక్కాలని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. "రాములవారు పుట్టిన తర్వాత బీజేపీ పుట్టిందా? బీజేపీ పుట్టిన తర్వాత దేవుడు పుట్టాడా? ఆ పార్టీ పుట్టి కేవలం 40 ఏళ్లు అవుతుంది. సీతమ్మ, రాములవారు పుట్టి నాలుగు యుగాలవుతోంది. ప్రధాని మోదీ, ఇక్కడి బీజేపీ నేతలు సీతారాముల కల్యాణం చేస్తారో లేదో తెలియదు నేను. మాత్రం ప్రతియేటా చేస్తాను" అని వ్యాఖ్యానించారు. అయోధ్య గుడికి అసలు కారకుడు బీజేపీ సీనియర్ నేత అడ్వాణీ అని, ఆయన దేశమంతా తిరిగి అయోధ్యలో రామాలయం కట్టాలని ప్రచారం చేశారని చెప్పారు. అలాంటి అడ్వాణీని కనీసం సన్మానించారా? అంటూ బీజేపీ నేతలను నిలదీశారు. సొంత పార్టీ నేత అడ్వానీ త్యాగమే గుర్తించని బీజేపీ.. కాంగ్రెస్ పార్టీ నేతల త్యాగం గుర్తిస్తుందా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌ను ఎందుకు కలిశారో తనకు తెలియదు కానీ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎంను ఎమ్మెల్యేలు కలవాలంటే కుదిరేది కాదన్నారు. గత తొమ్మిదేళ్లలో దక్కని అవకాశాన్ని సీఎం రేవంత్ 2 నెలల్లోనే కల్పించారన్నారు. గత తొమ్మిదేళ్లుగా చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకే సీఎం రేవంత్‌పై బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

ఈసీ ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు

- అమోయ్‌కుమార్, సుశీల్‌కుమార్, శ్రీధర్‌లకు బాధ్యతలు..

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పోస్టింగులు ఇచ్చింది. ఈమేరకు సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే.. వేటు పడిన అధికారులకు అప్రాధాన్య పోస్టింగులు ఇవ్వడం గమనార్హం. అలాగే సుదీర్ఘకాలం పాటు సింగరేణి సంస్థ సీఎండీగా పని చేసి, ఇటీవల బదిలీ అయి వెయిటింగ్‌లో ఉన్న ఎన్.శ్రీధర్‌కు కూడా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఆయన్ను షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతలు చూస్తున్న సాగునీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాను బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది. ఈసీ ఆదేశాలతో పోస్టింగ్‌లు కోల్పోయి, వెయిటింగ్‌లో ఉన్న డి.అమోయ్‌కుమార్‌ను పశు సంవర్ధక శాఖ జాయింట్ సెక్రటరీగా, టి.వినయ్‌కృష్ణారెడ్డిని వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీగా, ఎస్.హరీశ్‌ను రవాణా, రోడ్లు-భవనాల శాఖ జాయింట్ సెక్రటరీగా ప్రభుత్వం నియమించింది. గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్న పి.కాత్యాయనిదేవిని బదిలీ చేసి తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(టీఎస్ఐఆర్‌డీ) సీఈఓగా నియమించింది. ఈ పోస్టు అదనపు బాధ్యతలు చూస్తున్న పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాను రిలీవ్ చేసింది. అలాగే వెయిటింగ్‌లో ఉన్న నాన్-కేడర్ అధికారి సుశీల్‌కుమార్‌ను గనుల శాఖ డైరెక్టర్‌గా నియమించింది.

మే నెలలో ఎంసెట్.. నేడు షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే మే నెలలో ఎంసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ గురువారం విడుదలకానుంది. ఎంసెట్‌తోపాటు రాష్ట్రంలో నిర్వహించే ఇతర ప్రవేశ పరీక్షల షెడ్యూళ్లను కూడా ఇదే రోజున అధికారులు విడుదల చేయనున్నారు. ఈ ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఆమోదం తెలిపారు. ఎంసెట్‌తోపాటు లాసెట్, ఐసెట్, ఈసెట్ వంటి ప్రవేశ పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. ఈ సెట్ల షెడ్యూల్‌ను ముందుగానే విడుదల చేస్తే అందుకనుగుణంగా విద్యార్థులు సన్నద్ధం కావడానికి అవకాశముంటుంది. అధికారులు కూడా ప్రవేశ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు చేసుకునే వీలుంటుంది. ఈ నేపథ్యంలో ఆయా సెట్లను నిర్వహించే కమిటీలు, కన్వీనర్లను కూడా ప్రకటించనున్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామక ఫైల్‌ను సత్వరం ఆమోదించండి

తమిళిసైతో సీఎం, డిప్యూటీ సీఎం భేటీ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్‌తో భేటీ అయ్యారు. ప్రభుత్వం తరఫున నిర్వహించే గణతంత్ర దినోత్సవాలకు హాజరు కావాల్సిందిగా ఆమెను ఆహ్వానించారు. గవర్నర్‌తో 20 నిమిషాలపాటు ప్రత్యేకంగా సాగిన సమావేశంలో.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామకం, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పేర్లపై చర్చించినట్లు సమాచారం. టీఎస్‌పీఎస్సీకి చైర్మన్‌ను నియమించి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్న ప్రభుత్వం.. రెండు రోజుల క్రితమే దానికి సంబంధించిన ఫైల్‌ను పంపింది. దానికి సత్వరం ఆమోదం తెలపాలని సీఎం, డిప్యూటీ సీఎం ఈ భేటీలో గవర్నర్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. ఆ ప్రక్రియ ముగిసిన వెంటనే సభ్యులకు సంబంధించిన జాబితాను కూడా పంపిస్తామని చెప్పినట్లు సమాచారం. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నందున ఈ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు వారు గవర్నర్‌కు వివరించారు. తమిళిసై కూడా దీనికి సంబంధించి మరిన్ని వివరాలు అడిగి తెలుసుకున్నట్టు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. ఇక గవర్నర్ కోటా ఎమ్మెల్సీల విషయానికి వస్తే.. గత ప్రభుత్వం దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను ప్రతిపాదించగా, వారిని నామినేట్ చేయడానికి తమిళిసై నిరాకరించిన సంగతి తెలిసిందే. గవర్నర్ కోటాలో నియమితులయ్యేవారు సాహిత్యం, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం, సమాజ సేవ వంటి రంగాల్లో నిష్ణాతులై ఉండాలి. ఈ అర్హతలు లేవంటూ దాసోజు, కుర్ర పేర్లను గవర్నర్ తిరస్కరించారు. ఈ నేపథ్యంలో.. రేవంత్ సర్కారు ఆ కోటా కింద ఇద్దరి పేర్లను ప్రతిపాదిస్తూ ఫైల్‌ను గవర్నర్‌కు పంపాలని భావించింది. అయితే ఈలోగా దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ కోర్టుకు వెళ్లారు. తమ పేర్లను తిరస్కరించడం చట్టవిరుద్ధమని.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా తమను నామినేట్ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని వారు కోర్టును కోరారు. దీంతో.. ఈ విషయం కోర్టులో ఉన్నందున తాను నిర్ణయం తీసుకోలేనని రేవంత్ సర్కారుకు గవర్నర్ స్పష్టం చేశారు. తాజాగా బుధవారం ఈ కేసును అడ్మిట్ చేసుకున్న న్యాయస్థానం.. ఎమ్మెల్సీలుగా కొత్త ప్రభుత్వం ప్రతిపాదించినవారిని గవర్నర్ నామినేట్ చేయకుండా స్టే ఇవ్వడానికి నిరాకరించింది. కాబట్టి ఈ ప్రక్రియపై ముందుకు వెళ్లొచ్చనే అభిప్రాయంలో ఉన్న ప్రభుత్వం.. ఆ విషయాన్ని గవర్నర్‌కు తెలిపింది. తాము ఈ కోటాకు అర్హులైన వ్యక్తులనే సిఫారసు చేస్తామని రేవంత్, భట్టి బుధవారం భేటీలో తమిళిసైకి వివరించగా.. దీనిపై న్యాయసలహా తీసుకుంటానని ఆమె చెప్పినట్టు తెలిసింది. ఫిబ్రవరి 2వ వారంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు నిర్వహించే ఉద్దేశంతో ఉన్న నేపథ్యంలో రేవంత్, భట్టి ఆ విషయాన్ని కూడా గవర్నర్ వద్ద ప్రస్తావించినట్టు సమాచారం. కాగా.. గత కేసీఆర్ సర్కారు తీరుకు భిన్నంగా గణతంత్ర దినోత్సవాలకు గవర్నర్‌ను నేరుగా కలిసి ఆహ్వానించిన సీఎం, డిప్యూటీ సీఎం.. గవర్నర్ ప్రసంగానికి సంబంధించిన విషయాలను కూడా వివరించారు.


రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

అన్నిరంగాల్లో బాలికలు ముందుండాలి

జిల్లావ్యాప్తంగా ఘనంగా బాలికాదినోత్సవ కార్యక్రమాలు



సిద్దిపేటలో విద్యార్థులకు పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న అడిషనల్ కలెక్టర్ గరిమా అగ్రవాల్



మద్దూరు కస్తూర్బా పాఠశాల బాలికలతో ప్రిన్సిపాల్



జగదేవ్‌పూర్‌లో మాట్లాడుతున్న సివిల్ జడ్జి సౌమ్య



హుస్నాబాద్: సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ

సిద్దిపేట క్రైం/చిన్నకోడూరు, జనవరి 24 : బాలికలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని జిల్లా కలెక్టర్ గరిమా అగ్రవాల్ పేర్కొన్నారు. సిద్దిపేట పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం అదనపు జిల్లా కలెక్టర్ గరిమా అగ్రవాల్ ఎనీమియా ముక్త్ భారత్ పథకంలో భాగంగా 8 నుంచి 12వ తరగతుల విద్యార్థినులకు హిమోగ్లోబిన్ శాతం నిర్ధారణ పరీక్షల కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ బాలికల దినోత్స వ సందర్భంగా విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతీ విద్యార్థిని రక్తహీనత పైన అవగాహన పొందాలని, తదనుగుణంగా తీసుకోవలసిన ఐరన్ అందించే పోషకాహారాలపైన అవగాహనను పెంపొందించుకోవాలని తెలిపారు. వైద్య బృందం సూచనల మేరకు ఐఎఫ్ఏ మాత్రలను, విటమిన్ సీ మాత్రలను రోజువారీగా స్వీకరించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ చైల్డ్ హెల్త్ డాక్టర్ విజయారాణి, జిల్లా ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రాంగోపాల్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు మనోహర్, నాసర్పుర అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు. అదేవిధంగా జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా చిన్నకోడూరు మండలం రామంచ గ్రామంలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో బాలింతలకు, కిషోర బాలికలకు నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ పాల్గొని పోషకాహార లోపం గల పిల్లలకు తీసుకోవలసిన జాగ్రత్తల గూర్చి వివరించారు. అంతకు ముందు వెడ్నస్ డే, టెన్ మినిట్స్ కార్యక్రమంలో భాగంగా ఆమె గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం సెంటర్-2ను ఆమె పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు, ఆరేళ్ల లోపు పిల్లలకు అందుతున్న సేవలు గూర్చి అడిగి తెలుసుకొని, పిల్లల బరువు, ఎత్తులను పరిశీలించారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. మహిళా శిశు, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో విజేతలుగా నిలిచిన బాలికలకు బహుమతులు ప్రదానం చేశారు. డిసెంబరు, జనవరి మాసాలలో ఆడపిల్లలకు జన్మనిచ్చిన తల్లులను సన్మానించారు. అదేవిధంగా గ్రామంలోని డంపింగ్ షెడ్డులో తడి, పొడి చెత్తను, వర్మీ కంపోస్టును డీపీవో దేవకీదేవితో కలిసి పరిశీలించారు. అనంతరం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి రాంగోపాల్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి విజయ రాణి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో సోమిరెడ్డి, సర్పంచ్ సంతోషి, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, వార్డు సభ్యులు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు హక్కులపై అవగాహన ఉండాలి

- అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి

హుస్నాబాద్, జనవరి 24 : బాలికలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని హుస్నాబాద్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ అన్నారు. బుధవారం హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో నేషనల్ లీగల్ సర్వీసు అథారిటీ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏటా జనవరి 24న జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. బాలిక విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారాలకు ప్రాముఖ్యం ఇవ్వడం కూడా బాలికా దినోత్సవ లక్ష్యాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ తోట మహేశ్, అడ్వకేట్ సంపత్, శ్రీ చైతన్య పాఠశాలల చైర్మన్ మల్లెపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీ విద్య, ప్రిన్సిపాల్ తిరుమల్, డీన్ తిరుపతి తదితరులున్నారు.

పలు మండలాల్లో ..

● **చేర్యాల:** మండలంలోని వేచరేణి గ్రామంలో అంగన్‌వాడీకేంద్రంలో బుధవారం నిర్వహించిన తల్లుల సమావేశం నిర్వహించారు. పోషకాహారలోపం పిల్లల ఎదుగుదలపై ప్రభావం చూపుతుందని, బలవర్ధక ఆహారాన్ని అందించాలని సర్పంచు ఏనుగుల యాదయ్య సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లక్ష్మీనర్సమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

దుబ్బాక/మిరుదొడ్డి: దుబ్బాక మున్సిపాలిటీలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో, మిరుదొడ్డి మండలం అందె జడ్పీహెచ్ఎస్ అంగన్‌వాడీ కేంద్రంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని వేర్వేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల హక్కులపై కూడా అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దుబ్బాక ఎస్ఐ గంగరాజు, కేరింగ్ సిటిజన్స్ కలెక్టివ్ జిల్లా కోఆర్డినేటర్ ప్రవీణ్, ప్రిన్సిపాల్ స్వాతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

● **గజ్వేల్:** జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని గజ్వేల్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పీవీ ఉమాశశి మాట్లాడుతూ బాలికలు పౌష్టికాహార లోపం ఉండకుండా, అన్ని రంగాల్లో ప్రతిభను సాధించాలన్నారు. వారితో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు కస్తూరిబాయి, డాక్టర్ జయరాజ్, అధ్యాపకులు ఉన్నారు.

● **జగదేవ్‌పూర్:** బాలికలు తమ కాళ్లపై తాము నిలబడాలని ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి సౌమ్య అన్నారు. బుధవారం జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికా దినోత్సవం నిర్వహించారు. బాలికల హక్కులకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రమోహన్, సోషల్ వర్కర్ రంగాచారి, సర్పంచ్ లక్ష్మి, అడ్వకేట్ రామకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలికాదినోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ ఏడాది జనవరిలో పుట్టిన పిల్లల ఇంటి ముందు మొక్కలను నాటారు.

● **మద్దూరు:** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. స్వప్న, ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

దాచారంలో ఉచిత పశువైద్య శిబిరం

గజ్వేల్ రూరల్, జనవరి 24. గజ్వేల్ మండలం దాచారం గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ మరియు పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా బుధవారం ఉచితంగా పశువైద్యం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 38 పశువులకు గర్భ నిర్ధారణ పరీక్షలు, 6 పశువులకు కృత్రిమ గర్భధారణ ఎద సుదులు, 2 గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సలు, 32 పశువులకు సాధారణ చికిత్సలు, 36 దూడలకు నట్టల నివారణ మందులు అందించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏడీ డాక్టర్ రమేశ్ బాబు, డాక్టర్ శిరీష, గోపాలమిత్ర గౌరీశంకర్, రైతులు పాల్గొన్నారు.

విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలి

కొండపాక, జనవరి 24 : టీపీటీఎఫ్ రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయేందర్ రెడ్డి కోరారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మంలో ఫిబ్రవరి 11, 12 తేదీల్లో సభలు జరుగుతాయని సిద్దిపేట జిల్లా నుంచి అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ నాయకులు జి తిరుపతిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎస్ కనకయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

గజ్వేల్, జనవరి 24: గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని డీఎల్‌పీవో కార్యాలయంలో బుధవారం గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో డీఎల్‌పీవో వేదవతికి వినతిపత్రాన్ని అందజేశారు. వారితో నాయకులు యాదగిరి, నాగరాజు, భరత్, చెన్నయ్య, బాబురావు, భిక్షపతి తదితరులున్నారు.

పంచాయతీ రికార్డుల పరిశీలన

మద్దూరు, జనవరి 24: మండలంలోని రేబర్తి గ్రామ పంచాయతీ రికార్డులను బుధవారం డీఎల్‌పీవో వీరభద్రం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ అభివృద్ధి ప్రణాళికకు నిర్వహించిన గ్రామ సభలో పాల్గొని మాట్లాడారు. అనంతరం కంపోస్టు షెడ్డులో తయారవుతున్న వర్మికంపోస్టును పరిశీలించారు. నర్సరీని సందర్శించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ డాకూరి లక్ష్మి, పంచాయతీ సెక్రెటరీ మాధవ్ జాదవ్, ఏఈవో కల్పన, వార్డు సభ్యులు ఉన్నారు.

గుండెపోటుతో కార్మికుడి మృతి

జగదేవ్‌పూర్, జనవరి 24: మర్కూక్‌కు చెందిన పారిశుధ్య కార్మికుడు పెద్ద రాజు(40) మంగళవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. ఏపీడీ కౌసల్యదేవి బుధవారం గ్రామ సర్పంచ్ భాస్కర్‌తో కలిసి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.అనంతరం రూ.15వేల ఆర్థిక సహాయం అందించారు. అలాగే ఎంపీటీసీ రూ. 5 వేలు, శ్రీనివాస్‌రెడ్డి రూ. 10వేలు, తోటి కార్మికులు కలిసి రూ. 10వేల ఆర్థికసాయాన్ని అందించారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి

గజ్వేల్, జనవరి 24: పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నాల కుమార్ డిమాండ్ చేశారు. గజ్వేల్‌లోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులతో కలసి ఈ నెల 29న ఇందిరాపార్కు చౌరస్తాలో నిర్వహించనున్న జయబేరి మహాసభ కరపత్రాన్ని బుధవారం ఆవిష్కరించారు.

సురక్షితంగా గమ్యం చేరడంలో డ్రైవర్లే కీలకం



గజ్వేల్: ప్రజ్ఞాపూర్ చౌరస్తాలో 108, 102 డ్రైవర్లను సన్మానిస్తున్న డిపో మేనేజర్ సురేఖ



హుస్నాబాద్‌లో డ్రైవర్లకు పుష్పాలు అందజేస్తున్న డీఎం వెంకటేశ్వర్లు

గజ్వేల్, జనవరి 24: ఓ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సురక్షితంగా చేరాలంటే డ్రైవర్లు కీలకమని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ బి.సురేఖ పేర్కొన్నారు. బుధవారం డ్రైవర్ల దినోత్సవా న్ని పురస్కరించుకుని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపోలో ఆర్టీసీ డ్రైవర్లను, ప్రజ్ఞాపూర్ బస్టాండ్ వద్ద 108, 102 వాహనాల డ్రైవర్లను ఆమె సన్మానించారు. మహాలక్ష్మి పథకం ద్వారా ట్రాఫిక్ పెరిగినా అంకితభావంతో బస్సులను నడుపుతూ గమ్యస్థానాలకు చేరుస్తున్నారని డ్రైవర్లకు గులాబీ పూలు ఇచ్చి సన్మానించారు. అనంతరం 108, 102 వాహనాలను సురక్షితంగా నడుపుతూ అత్యవసర సమయంలో ఆసరాగా నిలుస్తున్నవారిని సన్మానించారు. వారితో 108, 102 డ్రైవర్లు చక్రపాణిగౌడ్, కొండల్‌రెడ్డి, నర్సింహులు, ఆర్.నర్సింలు, శ్రీనివాస్, రమేశ్‌గౌడ్, రాజు, కరుణాకర్, బానుప్రసాద్, జి.స్వామి తదితరులున్నారు.

● **హుస్నాబాద్ టౌన్:** హుస్నాబాద్ పట్టణంలోని బస్టాండ్‌లో బుధవారం డ్రైవర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపో మేనేజర్ సీహెచ్ వెంకటేశ్వర్లు డ్రైవర్లకు పువ్వులు, స్వీట్లు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఎంతో మంది ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరవేస్తున్న డ్రైవర్లకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు మేనేజర్ అరుణ్‌కుమార్, కంట్రోలర్ తిరుమల్ రావు తదితరులున్నారు.

హుస్నాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో.. నిధుల కేటాయింపుపై తీర్మానాలు

హుస్నాబాద్, జనవరి 24 : హుస్నాబాద్ మున్సిపల్ పాలకవర్గ సాధారణ సమావేశం బుధవారం చైర్‌పర్సన్ ఆకుల రజిత అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పలు అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపులపై తీర్మానాలు చేశారు. ప్రధానంగా మిగిలిపోయిన మున్సిపల్ నూతన భవన నిర్మాణ పనులకు 14వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ. కోటి కేటాయించాలని తీర్మానించారు. మినీ స్టేడియం వద్ద ఉన్న శ్మశాన వాటిక వద్ద లైట్ల ఏర్పాటుకు రూ. 10లక్షలు, క్లీన్‌టాయిలెట్స్ క్యాంపెయిన్‌లో భాగంగా పట్టణంలో ఉన్న అన్ని నూతన పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణం, సైన్ బోర్డులు ఏర్పాటు చేసేందుకు రూ. 23 లక్షలు, పట్టణంలోని మల్లెచెట్టు వద్ద ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ మిగులు పనులకు అదనంగా రూ. 4.50 లక్షలు, అవుట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల దుస్తులు, ఇతర వస్తువుల కొనుగోలుకు రూ. 4.90 లక్షలు, బ్లీచింగ్ పౌడర్ కొనుగోలుకు రూ. 99 వేలు, పైపు లైన్, ట్యాంక్ లైన్ మరమ్మతులకు రూ. 10 లక్షలు కేటాయించాలని కౌన్సిలర్లు తీర్మానం చేశారు. ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ రాజశేఖర్, పెరుక భాగ్యరెడ్డి, వల్లపు రాజు, దొడ్డి శ్రీనివాస్, గూళ్ళ రాజు, కె నళినదేవి, చిత్తారి పద్మ, రత్నమాల, బోజు రమాదేవి, కోమటి స్వర్ణలత, లలిత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

పంటల్లో సస్యరక్షణ పద్ధతులపై రైతులకు శిక్షణ



దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్‌లో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్

గజ్వేల్, జనవరి 24: దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ గ్రామంలో రెండు రోజుల పాటు సస్యరక్షణ బృందం ఆధ్వర్యంలో పంటల్లో సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి డి.శివప్రసాద్ పంటల్లో వచ్చే చీడపీడలను నివారించే చర్యలను వివరించారు. అనంతరం సస్యరక్షణాధికారి సునీత మాట్లాడుతూ కూరగాయలు, మొక్కజొన్న పంటలలో పాటించవలసిన సస్యరక్షణ చర్యలను తెలియజేశారు. వ్యవసాయ శాస్త్రవేత్త రమాదేవీ కూరగాయలు, మొక్కజొన్న పంటల్లో వచ్చే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను గూర్చి వివరించారు. వారితో సహాయ సస్యరక్షణ అధికారి నీలారాణి, ఏవో గోవిందరాజులు, ఏఈవోలు ప్రవీణ్, రాజుగౌడ్, సునంద, సంతోష్ పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన

చిన్నకోడూరు, జనవరి 24: పంటల సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ పద్మ, తోర్నాల వ్యవసాయ పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డా. శ్రీదేవి పేర్కొన్నారు. మండలంలోని చిన్నకోడూరు, పెద్దకోడూరు, మెట్టుపల్లి గ్రామాల్లో వరి, పొద్దుతిరుగుడు మొక్కజొన్న పంటలను అధికారులు, శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రధానంగా వరిలో పిలక దశలో ఉన్న పొలాల్లో నాచు వల్ల ఎదుగుదల లోపించింది. దీని నివారణకు ఆరుతడి విధానంలో మూడు రోజులకు ఒక్కసారి నీరు మార్చాలని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా. విజయ కుమార్ , డా. సరిత, మండల వ్యవసాయ శాఖ అధికారి జయంత్ కుమార్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

● **జగదేవ్‌పూర్:** మర్కూక్ మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం వ్యవసాయ అధికారి నాగేందర్ రెడ్డి వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగిలో సాగు చేసిన వరి పంటల సంరక్షణకు రైతులు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే వ్యవసాయ అధికారులసూచనల మేరకు మందులను పిచికారీ చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



సిద్దిపేటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ రామకృష్ణ

సిద్దిపేట క్రైం, జనవరి 24: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ పేర్కొన్నారు. సిద్దిపేట పట్టణం గాంధీ చౌరస్తాలో బుధవారం ప్రజలకు, వ్యాపారులకు రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా మైనర్ డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల గురించి, రోడ్డు నిబంధనల గురించి అవగాహన కల్పించారు. వాహనదారులు ప్రజలలో మార్పు వచ్చినప్పుడు మాత్రమే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు.పార్కింగ్ ప్రదేశాలలో వాహనాలు పార్కు చేసుకోవాలని, రోడ్డుకు అడ్డదిడ్డంగా వాహనాలు పార్కు చేయవద్దని తెలిపారు. ప్రతీ వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

● **చేర్యాల:** ప్రతీ వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్ పాటించి రోడ్డుప్రమాదాల నివారణకు పాటు పడాలని చేర్యాల ఎంవీఐ కవిత పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని బుధ వారం చేర్యాల పట్టణంలోని ఎంవీఐ కార్యాలయ ఆవరణలో వాహనదారులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. వాహనదారుడు విధిగా హెల్మెట్ ధరించాలని, పరిమితికి మించిన వేగంతో ప్రయాణం చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో కార్యాలయ సివిల్ అసిస్టెంట్ పి.అశోక్‌కుమార్, హోంగార్డు రామేశ్వర్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.



నాచగిరి క్షేత్రంలో హుండీ కానుకలను లెక్కిస్తున్న అధికారులు, భక్తులు

నాచగిరి లక్ష్మీనృసింహుడి హుండీ ఆదాయం రూ.17.85లక్షలు

వర్గల్, జనవరి 24: మండలంలోని నాచారం నాచగిరి లక్ష్మీనృసింహుడి క్షేత్రంలో హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. దేవాదాయశాఖ సహాయ కమిషనర్ శివరాజు, ఇన్‌స్పెక్టర్ రంగారావు పర్యవేక్షణలో హుండీ లెక్కింపు నిర్వహించగా రూ. 17,85,882 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుధాకర్, పాండు, నరేందర్, నర్సింహులుతో పాటు భ్రమరాంబికసేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ముంబై మారథాన్ రన్నర్లను అభినందించిన సీపీ

సిద్దిపేట క్రైం, జనవరి 24: ముంబాయి మారథాన్‌లో పాల్గొని మెడల్, సర్టిఫికెట్ సాధించిన సిద్దిపేట రన్నర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులందరు బుధవారం పోలీస్ కమిషనర్ బి.అనురాధను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మారథాన్ పూర్తిచేసిన కార్యవర్గ సభ్యులందరినీ అభినందించి మాట్లాడారు. ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చని తెలిపారు. వచ్చే ఆగస్టులో సిద్దిపేట సెకండ్ ఎడిషన్ ఆఫ్ మారథాన్‌లో రన్నింగ్ పై ఆసక్తి ఉన్న యువత ఇప్పటి నుంచే ప్రాక్టీస్ మొదలుపెట్టి సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తుల బాపురెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రఘుపతి రెడ్డి, రన్నర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడు పరంధాములు, రాజు, వెంకట్, అశోక్, కృష్ణారెడ్డి, జగదీశ్వర్, మహేష్, రవి, నర్సింహులు, రమేష్, విజయ్, మురళి, అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూంపల్లి ఆస్పత్రి పనులను త్వరగా పూర్తిచేయాలి




భూంపల్లిలో ఆసుపత్రి పనులను పరిశీలించి మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి

మిరుదొడ్డి, జనవరి 24: ఆసుపత్రి పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా వైద్యాధికారి కాశీనాథ్ సూచించారు. బుధవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లిలో నిర్మిస్తున్న 30 పడకల ఆసుపత్రి పనులను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రిలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయన వెంట జిల్లా ఉపవైద్యాధికారి శ్రీనివాస్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఏఐటీయూసీలో బీడీ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ విలీనం

సిద్దిపేట అర్బన్, జనవరి 24 : బీడీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఏఐటీయూసీలో విలీనం చేస్తున్నట్టు సంఘం నాయకులు దీకొండ శ్రీనివాస్ తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, అధ్యక్షుడు రంగారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం దీకొండ శ్రీనివాస్ ఏఐటీయూసీలో చేరారు. కార్మికులు, కర్షకుల తరఫున ఏఐటీయూసీ నిరంతర పోరాటాలు చేస్తుందని, భవిష్యత్తులో సంఘం తనకు ఎటువంటి బాధ్యతలు అప్పజెప్పినా సమర్థవంతంగా నిర్వహిస్తానని ఈ సందర్భంగా శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, అంజగౌడ్, సత్యం ,రవి, నాగమ్మ, భారతి, జ్యోతి, పద్మజ తదితరులు ఏఐటీయూసీలో చేరారు.

కస్తూర్బా పాఠశాలలో కొత్తగా 288 డ్యూయల్ డెస్కులు



తరగతి గదిలో ఏర్పాటు చేసిన డ్యూయల్ డెస్కులపై చదువుకుంటున్న విద్యార్థినులు

మద్దూరు, జనవరి 24: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషి ఎనలేనిదని పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.స్వప్న తెలిపారు. బుధవారం మద్దూరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు సర్వశిక్షాభియాన్ కార్యక్రమంలో భాగంగా డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి 288 డ్యూయల్ డెస్కులు వచ్చాయి. ఈ విషయమై బుధవారం ప్రిన్సిపాల్ మాట్లాడారు. కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు మొత్తం 288 డ్యుయల్ డెస్కులు వచ్చాయన్నారు. వీటి బిగింపు పూర్తి చేసి తరగతి గదిలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాఠశాలలో 195 మంది విద్యార్థినులు విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

రాజవీరు ఆశయ సాధనకు కృషి చేయాలి

అక్కన్నపేట, జనవరి 24: మాజీ ఎంపీపీ స్వర్గీయ కోమటి రాజవీరు ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మల్లంపల్లిలో రాజవీరు 10వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కాంగ్రెస్ నాయకులు బబ్బురు యాదయ్య, కోమటి లింగామూర్తి, మ్యాక రమేష్, కోలిపాక సంపత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



మల్లయ్య(ఫైల్)

చేర్యాల, జనవరి 24: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు పొలం వద్ద ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మాడబోయిన మల్లయ్య(48) బుధవారం ఉదయం మల్లయ్య తన కుమారుడు రాజు కలిసి తెల్లవారు జామున వ్యవసాయబావి వద్దకు వెళ్లారు. అనంతరం కుమారుడు రాజు బావి వద్ద పాడిగేదెల పాలను కేంద్రంలో విక్రయించేందుకు తీసుకెళ్లాడు. మల్లయ్య బావి వద్ద మోటార్ స్టార్టర్ విద్యుత్‌వైరును సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. కొంతసేపటి తరువాత కుమారుడు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో బావివద్దకు వెళ్లి చూసేసరికి నీళ్లహౌస్ పక్కన తండ్రి పడి ఉండటాన్ని గమనించాడు. చేతిలో సర్వీస్ వైరు పట్టుకుని ఉండటంతో విద్యుదాఘాతంతో మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ దామోదర్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇరువురు కుమారులున్నారు.

తాడి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి



రవి(ఫైల్)

హుస్నాబాద్ రూరల్, జనవరి 24: హుస్నాబాద్ మండలం కుచనపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు తాడిచెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. కుచనపల్లి గ్రామానికి చెందిన మాటూరి రవి(48) బుధవారం తాడిచెట్టు ఎక్కి కల్లు గీసే సమయంలో ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారి పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు అతడిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య కళ, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు కస్తూర్బా విద్యార్థులు

గజ్వేల్, జనవరి 24: జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు గజ్వేల్ పట్టణంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు జరిగే 36వ జూనియర్ నేషనల్ నెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు మధ్యప్రదేశ్‌లోని ఖోర్గోన్ జిల్లాలో జరుగనున్నాయి. ఈ పోటీలకు తెలంగాణ తరఫున బాలికల విభాగంలో కస్తూర్బా పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని కె.ధరణి, సెకండియర్ ఎంపీహెచ్‌డబ్ల్యూ విద్యార్థిని పి.అనూష ప్రాతినిధ్యం వహించనున్నారు. ఎంపికైనవారిని పాఠశాల స్పెషల్ ఆఫీసర్ అనురాధ, పాఠశాల పీఈటీ జ్యోతి, ఉపాధ్యాయులు అభినందించారు.

నాణ్యమైన విద్య అందించేందుకు కృషి

● సిద్దిపేట జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

తొగుట, జనవరి 24: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేసి 'పది'లో మెరుగైన ఫలితాలు సాధించాలని సిద్దిపేట జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం తొగుట ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రిజిష్టర్లను పరిశీలించారు. పాఠశాల ఆవరణను పరిశీలించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం తొగుటలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాలి: ఎంఈవో

నంగునూరు, జనవరి 24: ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవడం అందరి బాధ్యత అని ఎంఈవో దేశిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నంగునూరు మండలం నర్మెట హైస్కూల్‌లో డీటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మనీష్‌కుమార్, ఉపాధ్యాయులు జనార్దన్ రెడ్డి, శ్రీనివాస్, మన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలమాకుల హైస్కూల్‌లో స్వయంపాలన



స్వయంపాలనలో పాల్గొన్న విద్యార్థులు

నంగునూరు, జనవరి 24 : మండలంలోని పాలమాకుల ప్రభుత్వ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులు బుధవారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలోనే అడ్మిషన్ పొందాలి

కొండపాక, జనవరి 24: వచ్చే విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే అడ్మిషన్ పొందాలని కొండపాక జూనియర్ కళాశాల అధ్యాపకులు విద్యార్థులకు సూచించారు. బుధవారం కొండపాక బాలుర, బాలికల పాఠశాలలతో పాటు సిరసనగండ్ల, దుద్దెడ, అంకిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలను సందర్శించి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఇంటర్ ప్రభుత్వ విద్య గురించి విద్యార్థులకు అధ్యాపకులు వివరించారు. అవగాహన లేకుండా ప్రైవేట్‌లో రూ.వేలాది ఫీజులను కట్టే అవసరం లేకుండా మండల కేంద్రంలో అన్ని సౌకర్యాలు కలిగిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వచ్చే విద్యా సంవత్సరంలో చేరాలని అధ్యాపకుల బృందం సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శశిధర్‌రెడ్డి, శ్రీలీల, రాములు అనిత, గాదె వెంకన్న, సత్యనారాయణ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే ప్రతీ కార్యకర్తను కాంగ్రెస్ పార్టీ గుర్తిస్తుంది

● యూత్ కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ అధ్యక్షుడు

సిద్దిపేట టౌన్, జనవరి 24: కష్టపడే ప్రతి కార్యకర్తను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గుర్తిస్తుందని యూత్ కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ అధ్యక్షుడు వాహబ్ పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో యూత్ జోడో, బూత్ జోడో, డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమంలో పాల్గొని సిద్దిపేటలో సభ్యత్వ నమోదు చేసినందుకు సిద్దిపేట నియోజకవర్గ అధ్యక్షుడు వాహబ్‌కు యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌చార్జి సురభి, రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పూజల గోపీకృష్ణ ప్రశంసాపత్రం అందజేశారు.

ప్రొటోకాల్ పాటించడంలేదంటూ నల్లబ్యాడ్జీలతో నిరసన

మిరుదొడ్డి, జనవరి 24: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రొటోకాల్ పాటించడం లేదంటూ మిరుదొడ్డి ఎంపీపీ సాయిలు, దుబ్బాక ఆత్మకమిటీ చైర్మన్ భాస్కరచారి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు పోలీస్ రాజులు విమర్శించారు. బుధవారం మిరుదొడ్డి మండలం అల్వాల్ గ్రామంలో గ్రామపంచాయతీ భవన ప్రారంభోత్సవానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అందులో భాగంగా శిలాఫలకంపై స్థానిక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి పేరు విషయంలో ప్రొటోకాల్ పాటించలేదని వారు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. తాము మంత్రి కార్యక్రమాన్ని స్వాగతిస్తున్నామని, ఇకనైనా అధికారులు ప్రొటోకాల్ పాటించాలని కోరారు.

హుస్నాబాద్‌లో 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'

హుస్నాబాద్ టౌన్, జనవరి 24 : పట్టణంలో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. వివిధ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. స్ట్రీట్ వెండర్స్, ఉజ్వల యోజన పథకాలు మంజూరైన లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ రాజశేఖర్, యూనియన్ బ్యాంకు మేనేజర్ అరుణ్ కుమార్, బీజేపీ పట్టణ అధ్యక్షులు బత్తుల శంకర్‌బాబు, కౌన్సిలర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

కొండపాక, జనవరి 24: ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మక విద్య అందుతుందని ఎంపీటీసీల ఫోరం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ అన్నారు. కుకునూరుపల్లి మండలం లకుడారం ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు రాజిరెడ్డి, రాజు, సంతోష్‌లను సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం జానకి రెడ్డి, కందూరి ఐలయ్య, సాయిలు ఉపాధ్యాయులు నర్సింలు, కనకయ్య, రామారావు విద్యార్థులు పాల్గొన్నారు.